# దేవుడా-నీకు జోహారు!



"ఎలా వుంది పోతరాజుగారూ.... బిజినెస్సు...."

"ఏం బిగినెస్సులెద్దురూ.... అనోసరంగా ఈ ఊబిలో దిగిపోయాను. అందరూ బిగినెస్సు సెయ్యలేరండి. అందులోనూ అచ్చాఫీసంటే మరీ కష్టం గదండీ....లాభాల్లేకపోతే పోనీండిగానీ, ఖర్చులైనా రావాలంటారా? మరికొద్ది రోజులు సూసి, అమ్మిపారేస్తానండీ...." అన్నాడు శ్రీ కళ్యాణచక్రవర్తి ఏడుకొండల శ్రీనివాస పద్మావతీ ప్రింటింగు ప్రెస్ ప్రొప్రయిటర్ పోతరాజు.

ప్రెస్‌కి అంత పొడుగు పేరెట్టినా, దాన్నందరూ "పోతరాజు ప్రెస్సు"నే అంటారు.

## మినీ కథావీధి

పైసంభాషణ మా ఇద్దరి మధ్య జరిగి, నాలుగు నెలలైంది. ఓ సారి చూసొద్దాం- పోతరాజు ఎలా వున్నాడో- అని బయలుదేరాను.

ప్రెస్‌లో అడుగు పెట్టాను,

పోతరాజు మహ బిజీగా వున్నాడు. ట్రెడిల్ (ప్రింటింగ్ మెషన్) నిర్విరామంగా రంగు రంగు కాగితాల్ని ముద్రిస్తోంది.

"అబ్బెబ్బే....... ఎనభై రూపాయలకు తక్కువ కాదండీ, రెండువేల కాపీలంటే యేమనుకుంటున్నారు. ఇరవై వందలు... అయినా దేవుడి విషయంలో బేరాలేటి సెప్పండి..... కళ్ళు పోగలవ్" అంటూ గాలిలో ఓ దండం ఆ కానరాని వాడికి పెట్టాడు.

మొత్తంమీద బేరమాడి, డెభ్భైఅయిదు రూపాయలకు ఖాయం చేసుకుని, ఓ ఏభై అడ్వాన్సిచ్చి వెళ్ళిపోయింది ఆ పార్టీ.

పోతరాజు నా వేపు చూస్తూ "నమస్కారం బాబూ రండి కూర్చోండి...." అన్నాడు బెల్ కొడుతూ.

బోయ్ వచ్చాడు.

"రేయ్ సిట్టిబాబూ... రెండు లిమ్కాలు పట్రారా...." అంటూ అయిదురూపాయల నోటిచ్చి పంపించాడు.

అతని కళ్లు చురుగ్గా వున్నాయి. మనిషి హుషారుగా వున్నాడు. కొత్తబట్టలు వేసుకున్నాడు.

నాకు చాలా ఆనందం కలిగింది. పోతరాజు ప్రెస్ ఇంప్రూవ్ అవుతున్నందుకు సంతోషించాను.

అయితే, ఇన్నాళ్ళూ లేనిది ఇంత తొందరగా ఎలా ఇంప్రూవైందా అని అనిపించింది. అదే అన్నాను. పోతరాజు చిరునవ్వు నవ్వుతూ- గోడకేసి చూస్తూ- "అంతా వాడిదయ" అన్నాడు చేతులు జోడించి, కళ్ళు మూసుకుంటూ.

ఇంతలో లోపల్నుంచి కంపోజిటర్ కామరాజు ఏదో ప్రూఫ్ తీసుకు వచ్చాడు.

"బాబూ....కాస్త తప్పులు దిద్దేద్దురూ." అన్నాడు పోతరాజు. అప్పుడేవచ్చిన మరో పార్టీతో మాట్లాడానికి వుద్యుక్తుడౌతూ.

ప్రూఫ్ చూశాను.

అది వనెయిత్ డెమ్మీ సైజులో వుంది. తెలుగులో మేటరు కంపోజై వుంది. మీది భాగంలో ఎడంవేపు స్ఫుటంగా వేంకటేశ్వరస్వామి బ్లాకు ప్రింటయి వుంది.

మేటర్ చదివాను.

శ్రీరస్తు. శుభమస్తు - ఇత్యాది ఫార్మాలిటీవన్నీ మీది భాగంలో అయాక—

"ఈ మధ్యను తిరుమల తిరుపతి దేవాలయమున ఒక వింత జరిగింది. ఒక తెల్లని కాంతి వంటి రూపము అటుల నడిచిపోయినది. ప్రధాన అర్చకుల కర్ణపుటములకు ఆ కళ్యాణచక్రవర్తి పలుకులు ఇటుల వినబడెను : ఓ పూజారీ! నా గొప్పతనమును, నిదర్శనమును నీవు చాటవలెను. నా సత్య కథలను నీవు ప్రచారము చేయవలెను. బొంబాయిలో బూందీ అగర్వాలా ఇంట జరిగిన చోరీ ముప్ఫయివేల రూపాయలు దొరికినవి- ప్రముఖ హిందీ నటుడి ఇంట దాచిన రెండు లక్షల రూపాయల నగదు- ఇన్‌కంటాక్స్‌వారి రైడులో దొరకక, సురక్షితముగా వున్నది. కలకత్తాలో కైలాస్ ముఖర్జీగారి ఏకైక మగ సంతానం మరణించి, తిరిగి జీవించినది. ఆంధ్రదేశమున శ్రీకాకుళ పట్టణమున అచ్యుతం ప్రభాకర దేవశాస్త్రి గారి ఇంట నా పూజ సలిపిన కారణమున లంకెల బిందెలు కనుగొనబడినవి. ఇవన్నీ ప్రచారం చేయుము. రెండు వేల ప్రతులు అచ్చు వేయించి పంచి పెట్టుము. ఈ కరపత్రము అందుకున్న ప్రతివ్యక్తి, ఒక వారము దినములలోగా, తలొక రెండువేల ప్రతుల చొప్పున అచ్చు వేయించి పంచవలెను. ఈ సత్య పలుకులను త్రోసిపుచ్చెడివారి ఆయువు క్షీణించును. న్యాయ్యమున ఓడిపోవుదురు వ్యాపారమున నష్టపోవుదురు. ఆ కుటుంబము సకల బాధలకు గురి అగును-" అని నుడివెను. ఈ మాటలు విన్న పూజారిగారు వెంటనే రెండువేల ప్రతులు వేయించి, పంచి పెట్టించెను. ఆయనకు కేరళ లాటరీలో రెండు లక్షల రూపాయలు బహుమతి

దేవరాజు రవి

వచ్చెను. అందుచేత ఈ కరపత్రము చదివిన వారు ఒక వారము దినములలోగా రెండువేల ప్రతులు అచ్చు వేయించి పంచవలెను. నిర్లక్ష్యము చేయవద్దు. స్వామివారి హెచ్చరిక గుర్తుంచుకొనగలరు-"

చదివాక అసలు సంగతి కొద్దిగా అర్థమైంది. ఇంతలో "ఎలావుంది బిగినెస్సు" అంటూ ఓ ఊర్ధ్వపుండ్రధారి, వల్పని వస్త్రధారణతో అక్కడికి వచ్చాడు.

పోతరాజు వినమ్రుడై లేచి నిలబడి, అతనికి నమస్కరించాడు, "తమ దయ" అంటూ.

"పని చూసుకో వస్తాను...." అంటూ అతను వెళ్ళిపోయాడు నావంక అదోలా చూస్తూ.

"ఎవరీయన" అన్నాను.

"ఆయన నా పాలిటి దేవుడు. ఈ ట్రిక్కు చెప్పి, తొలిసారిగా రెండువేలు

ప్రింటు చేయించింది ఈయనే. రోజుకి పాతిక ముప్పై ఆర్డర్లు వస్తున్నాయి. మేటరు ఒకసారి కంపోజ్ చేయిస్తే సరి. క్రింది పేరు, అడ్రసు మార్చి కొట్టేస్తున్నాం...." అన్నాడు.

"ఇంతకీ ఈయనెవరు?" అన్నాను.

"మా వూరి మాజీ ప్రెసిడెంటు మొన్న ఎలక్షన్లో ఓడిపోయి. ఫకీరై పోయాడు" అన్నాడు.

"మరి ఈ ట్రిక్కు మీకు ఊరకే చెప్పాడా" అన్నాను.

"డబ్బెందీ బాబూ...! వృత్తినే చెప్పాడేటి? ఖర్చులు పోను. టెన్ పర్సెంటిచ్చేస్తున్నాను...." అన్నాడు

"ఛాతి బొమ్మవైనా, పోతరాజువిల్లి బాగా బాగు చేస్తున్నావ్. దేవుడూ నీకు జోహార్" అంటూ అప్పుడే చిట్టిబాబు తెచ్చిన లిమ్కా అందుకున్నాను. ●


జుట్టుకు
సిల్కువంటి మృదుత్వము
నిచ్చుటకు నైసర్గిక
ఉపాయము...



శుద్ధమైన శీకాయిలోని సహజ లాక్షణిక గుణములు స్వస్తిక్ శీకాకాయ్ సబ్బులో నింపబడినవి. వాడడానికి అనువైనది. లిక్విడ్ షాంపూ కంటే ఎంతో పొదుపైనది.



దీని పుష్కలమైన, మృదువైన నురగ మీ జుట్టును మెత్తగా, పూర్తిగా శుభ్రపరుస్తుంది. మీ జుట్టును ఆరోగ్యంగా, నిగనిగలాడేలా వుంచుతుంది. తాజా సువాసన నిండిన పట్టువంటి మృదుత్వాన్ని ఒసగుతుంది.




స్వస్తిక్
శీకాకాయ్ సబ్బు

ఇందులో శీకాయి కలిసి వుంది. భారత స్త్రీల అందమైన జుట్టుకు పారంపర్యమైన రహస్యము.

shilpi dm 25/79 tel